మరుగుమందు

తెల్లారకముందే దుర్గమ్మ కుంపటి ముందు కూర్చొని అందులో ఎండుపుల్లలు వేస్తూ మంటలను లేపుతూ ఉంది. భార్య మంట పెట్టేది చూసి వెంకయ్య లేచొచ్చి కుంపటి ముందు కూర్చొని చుట్టను వెలిగించాడు.

"నీ వేవీ పట్టించుకోవు, చెట్టంత కొడుకు చేతినుండి పోయినంక దినాలు చేసి దేశాల పొంటి పోదాం" అన్నది.

"మన గీత సక్కగలేదు", అంటు తలకొట్టుకొన్నాడు.

"మనుసులు సేసిన పనికి గీతలెందుకు అనుకోవాలె!"

దుర్గమ్మ పుల్లలను ఎగదోసి మంటను కాస్తా పెద్దగ చేస్తూ అంది.

వెంకయ్య ఆలోచనలో పడ్డాడు.

"సర్‌పంచ్‌కి సెప్పొచ్చిన, తల్లి తండ్రికి సెప్పంపిన."

"వాళ్లు వొస్తున్నాలె గట్టిగ సెప్పు అది మాకొద్దు అని" మళ్లీ తానే అంది.

జగిట్లోని మంచంమీద రాములు గునిసినట్లు శబ్దం రాగానే వెంకయ్య చుట్టను ఆర్పి, పక్కన పెట్టి, లోపలికి వెళ్లి కొడుకు పడుకొని ఉన్న మంచపు పట్టెపై కూర్చొని వొంటిమీద చెయ్యేసి చూసి, వాకిట్లో ఏడుస్తున్న కుక్కను అదిలించడానికి బయటికి నడిచాడు.

రాములు ఇంటి వాసాలవైపు చూస్తూ, తన కొచ్చిన రోగాన్ని గూర్చి ఆలోచిస్తూ "బతికి బట్ట గడతానో, లేకపోతే యింతటితో..." అన్న తలంపు రాగానే కనుకొలుకులు తడి అయినవి. ఆ ఆపత్తి కాలంలో తన భార్యను తన దగ్గర ఉండకుండా చేసిన తల్లిని ఏమనాలో అర్థం కాక అసహనంగ పొర్లి పక్క మీద పడుకొని భార్యను గుర్తు తెచ్చుకున్నాడు.

పొద్దు బారెడెక్కింది. పిల్లబాటన నడుస్తున్న రాములు, ఆయన వెనకాల అతని భార్య ఊరుదాటి చెలకల్ల

నుండి నడుస్తున్నప్పుడు బాటకిరుప్రక్కల పచ్చగడ్డిమీద, చెట్ల ఆకుల మీద రాత్రి కుర్సిన మంచు బిందువులు మెరుస్తున్నవి. పిట్టలు లేత ఎండలో రెక్కల్ని ఆడారేసు కొంటున్నవి. ఎరుపు, పసుపు, నీలం రంగు గడ్డి పూలపై సీతాకోకచిలుకలు ఎగురుతున్నవి. అక్కడక్కడ నిలువెల్లా పూసిన మోదుగులు. ఇద్దరూ ఏదేదో మాట్లాడు కుంటూ, మధ్యమధ్యన నవ్వుకుంటూ సరిగ్గా అంబటాల్లకు ఇల్లుచేరారు.

రెండుగదులు, ఓ జగిలి ఉన్న తాటాకుల పూరిల్లు వాళ్లది.

మల్లమ్మది పుష్టి అయిన శరీరం, తెల్లని పలువరుస, చురుకైన చూపులు, గడ్డముకింద ఉన్న చిన్నిగుంట, అందంగా చెక్కిన నల్లరాయి శిల్పంలా ఉంది. తలకు వొత్తుగ అంటిన నూనె మెరుస్తున్నది. ముఖానికి పైసంత బొట్టు, కొప్పులో తంగెడిపూలు, చేతిలో బట్టలున్న సంచితో జాలారిలోకి వెళ్లి కాళ్లు, చేతులు కడుక్కొని ఇంట్లోకి నడిచింది.

రాములు పెళ్లి అయినప్పటినుండి భార్యను బాగానే చూసుకుంటున్నాడు. రోజంతా వ్యవసాయ పనులకు వెళ్లడం, ముదుసలి వాళ్లు అయినా తల్లి, తండ్రి ఏదో పని

చేస్తూనే ఉండడం, తిండి, బట్టకు ఇబ్బంది లేకుండా ఉన్నంతలో సంసారాన్ని నడుపుకుంటున్నారు. కానీ రాములు తల్లి దుర్గమ్మ ఆ యింట్లో జోరీగ.

వారం రోజుల కింద తల్లిగారి ఇంటికి పోయిన భార్యను తీసుకురావడానికి వెళ్లిన కొడుకు, అత్తగారి ఇంటి దగ్గర రెండు రోజులుండి రావడం దుర్గమ్మకు ఇష్టంలేదు. అసలు ఆమెది అదోతత్వం. తన అత్త తనను కట్టుబాటుల్లో పెట్టినట్టే తన కోడలును తాను కట్టుబాటుల్లో ఉంచాలన్న బలమైన కోరిక ఆమెది. ఆ కోరికే అవస్థలను సృష్టిస్తున్న సంగతి ఆమె ఎందువల్లనో గ్రహించదు. మారుతున్న కాలం విషయమూ ఆమె పట్టించుకోదు.

ఊరునుండి వచ్చిన కొడుకు, కోడలును చూసి మూతిని అటు ఇటు తిప్పుకుంటూ ముక్కుమీద వేలేసుకొని-

"ఇంకో రెండు రోజులుండి రాకపోయినవ్?"

రాములు చప్పుడు చెయ్యలేదు.

"మీ పూట గడిస్తే చాలు మేం ఎట్ల సస్తే ఏంది?" అన్నది మళ్లీ తానే.

"సూడే అమ్మ గింత దానికి, గంతదానికి సావులు -

బతుకులు ఎంచకు. సచ్చేనాడు ఎవ్వరు ఎవ్వర్ని ఆపరు".

కొడుకు తనకు జవాబు యిచ్చినందుకు దుర్గమ్మకు రోషం తన్నుకొచ్చింది.

"సచ్చేనాడు ఆపకుంటే మానె, బతికేటోల్లను సంపొద్దుర" అన్న తల్లితో ఎక్కువ మాట్లాడడం ఇష్టంలేక, బయటికి నడిచాడు.

దుర్గమ్మ తనలో తాను గొణుగుతూ నిలుచుంది.

కోడలు కొడుకును కొంగున కట్టేసుకుందని ఆమెకు కోపం. అదే కోపాన్ని ఆమె అప్పుడప్పుడు మాటల్లో, చూపుల్లో చూపిస్తూ ఉంటుంది. అంతేకాదు తనకు అనుమానం వచ్చినప్పుడల్లా "ఏమోనయ్యా! ఈ పిల్లను తెచ్చి వానికి సేస్తిమి, దీన్ని సూస్తుంటే ఎప్పుడు ఏం సెడు జరుగుద్దో అని భయంగ ఉంది" అని మొగనితో అంటూ ఉంటుంది దుర్గమ్మ.

"దాని తల్లి ఓమాయలాడి, దీనివి అన్నీ తల్లి బుద్దులే, నా తోడపుట్టినోనికి ఓ బిడ్డ ఉంటే, ఆ మేసదాన్ని సేసుకుందును. ఈనాటి దాంతో నానాపాట్లు" అని కూడా అంటూ ఉంటుంది.

మల్లమ్మ నీళ్లకు వెళ్లినప్పుడు, కూలి గింజల కెళ్లినప్పుడు, ఊళ్లో గంగిరెద్దులను ఆడిస్తున్నప్పుడు,

గారడీవాడు మాయలు చూపిస్తున్నప్పుడు కోడలిని ఓ కంట కనిపెడుతూ, ఎక్కడైనా ఎవరితో నన్న నవ్వినా, మాట్లాడినా వెంటనే మందలిస్తూ ఉంటుంది. తన కొడుకు కూడా ఎప్పుడూ పెళ్లాన్నే అంటిపెట్టుకొని ఉండడం ఇష్టపడక "అస్తమానం ఆడదాన్నే సూసుకుంటు ఉంటే మతి సెడుతది" అని అంటూ ఉంటుంది.

దుర్గమ్మ కాపురానికి వచ్చిన కొత్తలో తన మొగుడు తననే చూస్తూ ఉంటే తన అత్త "ఏందది ఊరపిచ్చుక చేష్టలు? దీపాన్ని ఆర్పేసి రాత్రి పక్కమీద తప్ప తెల్లారితే ఎవరి పనిమీద వాళ్లుండాలి." అని అనేదట. అత్త చెప్పినట్లుగా మసలుకున్న దుర్గమ్మ ఓ బిడ్డ, కొడుకును కనుకొని వాళ్లు పెళ్లీడు కొచ్చినంక గాని మొగుని ఎదురుగ నిలుచోని మాట్లాడలేదట.

కానీ తన కోడలు తనలాగ కాకుండ అందుకు భిన్నంగా ఉంది. అదో మాదిరిగ సింగారించుకోవడం, చిన్నా, పెద్దా లేకుండా మాట్లాడడం, సిగ్గు విడచి పరాయి మొగోళ్లతో వరాచికాలాడడం, అనర్థాలను తెచ్చిపెడతాయని ఆమె నమ్మకం. శార్థకాళ్లు చెప్పిన పురాణ కతలు, తోలుబొమ్మల ఆటలు ఆమెలో ఆ నమ్మకాన్ని పెంచినవి.

హద్దుదాటటం వల్ల సీతమ్మకు చెరలొచ్చినవి. నవ్వి నందుకే ద్రౌపది బట్టలు యిడిపించింద్రని, ఆడదాని నక్కదనం ఆడదానికి చెడు చెయ్యడం అటుంచి, అది సంసారం చేసే వంశానికే చేటును తెస్తదని తన ఒక్క కొడుకుకు ఎప్పుడు ఏ కీడు తెచ్చిపెడుతుందో నని ఆమె భయం.

ఒక రోజు వరి నాట్లకు ఊళ్లోకి వొస్తున్న చాలమంది ఆడవాళ్లలో తాను, తన కోడలు ఉన్నారు.

ప్రొద్దుకూకే సమయం, సూర్యుడు రంగు మారుతున్న వేళ. అంతకంటే ముందు కుర్సిన తెప్ప చినుకులకు తడిసిన వొళ్లను, వొంటిమీది గుడ్డలను, వొంటి వొంపు సొంపుల అందాలను ఆ నీరెండలో ఆరేసుకుంటూ, సరదాగ ఆ మాట ఈ మాట చెప్పుకుంటూ మధ్య మధ్యన నవ్వులను వొలకపోస్తూ పడుచువాళ్లు నడుస్తూ ఉంటే, వయస్సు దాటిన స్త్రీలు కొంగును వొంటినిండా కప్పుకొని దాని చాటున చేతులు ముడుచుకొని నడుస్తున్నారు.

దుర్గమ్మ ఉన్నట్టుండి వెనక్కు చూసింది. అంతే వొళ్లంతా వణికిపోయింది. ఎవరో ఒకతను సైకిల్‌ను నడిపించుకుంటూ, మల్లమ్మతో మాట్లాడుతూ పక్కమ్మటే నడుస్తున్నాడు.

"నడు, నడు" అని కోడలిని గద్దించినట్టుగ అంది.

ఇల్లు చేరినాక అడిగింది - "ఎవడాసైకిలోడు ?" అని.

మల్లమ్మ మాట్లాడలేదు.

"ఎవడాడు అంటే సప్పుడు సెయ్యవు ? " కాస్తా గట్టిగ అడిగింది.

"నాకు తెలవదు" అన్నది మల్లమ్మ.

"తెలవంది నీఎమ్మటే ఎందుకు నడిసిండు?"

తెలవదు అని అనలేదు కాని, అన్నట్టు చూసింది మౌనంగా , అత్త మనసులోని అనుమానపు ఆలోచన గ్రహించి.

"ఎవడైంది తెల్వదు, ఎంట ఎందుకు నడ్సిండు తెల్వదు, మరి ఏం మాట్లాడిండో అదన్నా యినబడ్డదా?"

వినబడ్డ దన్నట్టు ముఖాన్ని పెట్టి "ఈ తోవ ఏ ఊర్కి పోతది అని అడిగిండు" అన్నది.

"గది అడిగేతందుకు అంతదూరం నీ ఎమ్మటే నడవాలనా?"

మల్లమ్మ చప్పుడు చెయ్యలేదు. మూగగా అత్తనే చూస్తు నిలుచుంది. ఎదలో ఏదో దుఃఖపు అల కదిలి కనుకొలుకులను తాకి వెనక్కు వెళ్లింది.

"మనెమ్మటే వొస్తున్నోల్లందరూ ఎట్ల సూసింద్రో

సూసినవా?" అంటు కోడలిని కోపంగ చూసి కిరసనాయిల్ కోసం అని సీసాతో ఊల్లోకి నడుస్తూ "అయినా కలుపు చేలోనుంచి ఎల్లంగనే సింగులను సరిసేసుకుని కొంగు నిండా కప్పుకొని నడిస్తే ఎవ్వడూ ఎంటరాడు, ఎదురైన అని దీవన ఆడే పోతడు కానీ ఎదను వొదిలేసి, పిక్కలు కాసరాంగ నడుస్తుంటే మొగోడు మాత్రం.." అని అనుకుంటు కొట్టు చేరింది. ఆరోజు నుంచి ఆమె కోడలును మరీ అనుమానిస్తూ వొస్తుంది.

**

రాములుకు అనుకోకుండా జ్వరం వొచ్చింది. అది ఆ తర్వాత రోగంగా మారింది. ఎవరో చేతబడి చేయించారు అని ఏడుస్తూ మంత్రాలు వేయించింది. తావీజులు కట్టించింది, వెచ్చాలు తినిపించింది. పచ్చిమందులు పోయించింది తల్లి.

భర్తకు బాగాలేకపోవటం వల్ల లోలోపల కుంగిపోయింది మల్లమ్మ. ఆమెలో వెనుకటి కళా, కాంతీ లేదు. తనకు ఏ అన్యాయం జరుగుద్దో అని తన పసుపు కుంకుమలు చల్లగ ఉండాలని కోరుకుంటూ ఉండేది.

అత్తలేనిది చూసి రాములును గుండెలకు హత్తుకొని వొళ్లంతా నిమురుతు కంట నీరు పెట్టుకున్నప్పుడు తన

భార్య కళ్లలోకి చూస్తు - "నాకేం కాదు. ఏడవకు పిచ్చి దానా" అంటు ఆమె కళ్లను తుడిచేవాడు. అప్పుడామె తన్నుకొస్తున్న దుఃఖాన్ని నోటిలో కొంగు కుక్కుకొని ఆపుకుంటూ "నావల్లనే నీకీ ఆపదొచ్చిందట. నేను సెని ముండనట, యింకా, యింకా - ఏందేదో కనపడ్డోల్లందర్కి సెప్పుతుంది మీఅమ్మ. సెట్టంత మనిషివి సేతకాకుంట అయిపాయె. ఈ గండం ఎన్నడు గట్టెక్కుద్దో అని కంటికి నిద్ర పడతలేదు. నా మొగుడు బాగుండాలే, నా సంసారం సల్లగుండాలె అని నాకు మాత్రం ఉండదా" ఏడుస్తూనే అన్నది.

"అమ్మ సంగతి అటు పక్కకు పెట్టు, ఏదీ ఒక్కసారి నవ్వు" అంటు బార్య ముఖంలోకి తాను నవ్వుతూ చూశాడు.

**

మూడు నెలల తర్వాత రాములు ఆరోగ్యం కుదుట పడింది. కాస్తా అటు, ఇటు తిరుగుతూ ఉన్నాడు. దుర్గమ్మ మురిసిపోయింది. మల్లమ్మ ముఖం మళ్లీ కళ కళ లాడింది.

స్థలం మార్పిడి కావాలన్నారు కొందరు, వేరేచోట నిదుర చేయించాలన్నారు మరి కొందరు. అత్తగారి

ఇంట్లో నాలుగు రోజులు ఉండొస్తే సరిపోతుంది అన్నారు ఇంకొందరు.

దుర్గమ్మ తన కొడుకును పంపనంది. తన కొడుకుకు ఈ అవస్థ తన కోడలి వల్లనే వచ్చిందని గులిగింది. చివరికి పదుగురి మాటను కాదనలేక సరే నన్నది.

కొడుకు, కోడలును సాగసంపి ఇంటికొస్తున్న దుర్గమ్మకు పిల్లి అడ్డంగ వొచ్చింది.

ఇక ఆమె మనస్సు పరి పరి విధాల శంకించసాగింది.

రాములు అత్తగా రింట్లో పదిహేను రోజులుండి కాస్త సత్తువను సంతరించుకున్నాడు. కొత్తరక్తం పోసి కొంత మెరుగు అయ్యాడు. భార్యతో, బావా మరుదులతో సరసంగా తిరిగాడు.

ఉన్నట్టుండి మళ్ళీ జ్వరం తిరగపెట్టింది. అత్తవారింట్లో అందరూ ఆందోళన చెందారు. వెంటనే ఈ విషయన్ని ఆయన తల్లిదండ్రికి తెలియపర్చారు.

అది విన్న దుర్గమ్మ ఆఘమేఘాలమీద ఓ బండి కట్టించుకుని కొడుకుని తీసుకెళ్లడాని కొచ్చింది. మల్లమ్మ తల్లిని, తండ్రిని తిట్టిపోసింది. అంతేకాదు. తన కోడలిని రావద్దని శాసించింది.

మల్లమ్మ తల్లీ, తండ్రీ తెల్లమొఖం వేసి చూస్తు

నిలుచున్నారే తప్ప పల్లెత్తు మాట అనలేదు. మల్లమ్మ బండిలో వెళ్తున్న భర్తను చూస్తూ కుళ్లి కుళ్లి ఏడ్చింది. రాములు కళ్ళ నీరు పెట్టుకున్నాడు కానీ తన తల్లితో తన భార్యను తీసుకు రమ్మని చెప్పలేకపోయాడు. చెప్పినా వినదని అతని నమ్మకం.

రాత్రికి రాత్రే తన కొడుకును తిరిగి తన ఇంటికి తీసుకొచ్చింది.

కని, పెంచి, పెళ్లి చేసి - కొడుకు, కోడలు కలసి ఉంటే కళకళ లాడుతున్నది చూడాల్సిన తల్లులు ఎందుకిలా సాధిస్తారో అర్థం కాదు. అసలు ఏరి కోరి తెచ్చుకున్న కోడళ్లను ఎందుకిలా చూస్తారో - అన్న ప్రశ్న రాములును బాధిస్తోంది.

ఊరు చేరాక దుర్గమ్మ తన కొడుకుకు వచ్చిన ఆపద గురించి అందరికీ చెప్పింది. ఎందుకిలా అయిందని ఎరుక అడిగి చూసింది. కొలుపు చెప్పే దగ్గరకు తీసుకెళ్లి అచ్చకాయలను, పుచ్చకాయలను తీసేయించింది. అంతేకాదు అంజనం వేయించి తెలుసుకుంది. కోడలే ఈపని చేసిందని, అందుకే వాడు దాని వెంటే తిరిగేవాడని, అది ముదిరి ఇప్పుడు ప్రాణం మీది కొచ్చిందని అంచనా వేసుకొని నిజం అని నిర్ధారించుకుంది. ఆ విషయాన్ని

అందరికీ చెప్తూ కోడలిని, కోడలి తల్లిదండ్రులను తిట్టి పోస్తు శోకాలు పెట్టి ఏడుస్తూ శాపనార్థాలు పెట్టసాగింది.

జనం పంచాయతీ బోర్డు కార్యాలయం ముందున్న చింతచెట్టుకింద గుమికూడారు. చెట్టు మొదట చుట్టూరా ఉన్న అరుగుమీద సర్పంచ్ రాజిరెడ్డి, ఆయనకు అటూ ఇటూ సభ్యులూ కూర్చున్నారు.

అందరూ దీర్ఘాలోచనలో ఉన్నారు.

నులకమంచం మీద పడుకోబెట్టిన రాములు చింతచెట్టు కొమ్మల్లోకి చూస్తున్నాడు. కొమ్మల చివరన ఉన్న కాకి గూడు కనిపించింది. అతను తన చూపును తన పాదాల దగ్గర తలవంచి నిల్చున్న తన భార్య వైపు మరలించాడు.

కట్టుకున్నవాడు కాటి వైపు చూస్తుంటే ఏదో ఆశతో నిల్చుంది మల్లమ్మ.

"ఇది నా కొడుకుకు మందుపెట్టి సచ్చేటుట్టు సేసింది. సూడండి, ఎద్దసొంటి కొడుకు ఎట్లయిపోయిండో! అజ్జకారి నాసంతి, అది మాకిగ వొద్దే వొద్దు."

అది విని అక్కడ నిల్చున్న ఆడ, మగ అందరూ తమకు తోచినట్లు తలో మాదిరిగా అనుకుంటున్నారు.

"ముప్పయి ఏండ్లు దాటినా ఇంతవరకు పిల్లా, జల్లా లేదు. కడిది బలిసినట్టుగ బలిసి నా కొడుకును

మింగాలని చూస్తోంది."

దుర్గమ్మ ఇంకా గొంతు పెంచి, "పెద్దలారా! అయ్యలారా! మీ అందర్కి దండాలు. ఇడి కాయితం పెట్టించండి. దాని తోవన దాన్ని పొమ్మనండి."

మల్లమ్మ ఏ తప్పూ చేసినట్లు దాఖలాలు లేవు. మందు పెట్టిందన్న ఆరోపణ మాత్రమే బార్య భర్తలు విడిపోవడానికి ఏ రకంగానూ ఒప్పుకోదగ్గది కాదు. అందుకే అందరూ ఆలోచనలో పడ్డారు.

"ఈమె ఈ వూరి కోడలుగ వొచ్చిన నుండి ఏ చెడు వినలేదు. కూలి చేసుకుంటున్నా కులాసాగ ఉన్నారని విన్నాం." దుర్గమ్మ ఇచ్చిన దరఖాస్తును చేతిలో పట్టుకుని దాన్నే చూస్తూ అన్నాడు. సర్పంచ్.

"ఈ కథంతా అత్త కల్పించిందే. ఆల్లు బాగానే ఉన్నారు. ఈమే ఆల్లను సయిసనే సయిసదు. అది సూడ సక్కని దని కండ్ల మంటేమో మరి!" అంది రెండు చేతుల్లో రెండు కాలి పటవలను పట్టుకుని వనానికి పోతు ఆగి అక్కడే నిల్చున్న గొండ్ల బాలమ్మ. ఆమెకు ఊరంతా తెలుసు.

"సూస్తందుకు మంచిగనే కనపడతది. కానీ లోలోపల ఇంత పాపానికి వొడి కడతదనుకోలేదు. తల్లో! ఏదో

కులమింటి పిల్ల ఈడూ-జోడూ బాగుందని ఇంత కాయకష్టం సేసుకుని బత్తరు అనుకున్న గానీ, ఇట్ల మాయ జేస్తదనుకోలేదు. నా ఇల్లు ముంచుత దనుకోలేదు దేవుడో!" అంటు నెత్తి బాదుకోసాగింది.

"మనిషి అన్నప్పుడు రోగం, నొప్పులు రావా, సావు బతుకులు లేవా? మందో, మాకో తినాలే, బాగా సేసుకోవాలే గానీ అయ్యిందానికీ కాని దానికీ అనుమాన పడితేట్లా? నీవు నాలుగు కాలాలు సూసిందానివి, నీకు ఇంకోగలు సెప్పాల్నా?" అంది బాలమ్మ

పంచాయతీ జరిగే చోట నలుగురు చేరటం, తమకు తోచింది తా మనటం మామూలుగా జరిగే విషయం. అందుకని సర్పంచ్ కాని, సభ్యులు కానీ ఎవరూ ఏ అడ్డూ చెప్పటం లేదు. బాధపడే మనిషిని ఆ మనిషి బాధ ఏమిటో చెప్పగలిగినంత చెప్పనిస్తే, కొంత బాధ తగ్గుతుందన్న నమ్మకం కలిగినవాడు సర్పంచ్.

"అసలు నాకు తెల్వక అడుగుత దుర్గవ్వ! ఏం మందు పెట్టిందీ నీకోడలు? సచ్చేమందా, మరిగే మందా? సచ్చేమందైతే ఈ పాటికి ఆ డెప్పుడో పోవాలే! ఇక మరుగు మందు అందామా, దాని మొగుడు ఎప్పుడు దాని తోకమ్మలే నాయె. ఇగమందెందుకు ? అంత

నీఅనుమానం గానీ, ఇండ్ల జరిగిందేం లేదు" అంది బాలమ్మ ముక్కు మీద చూపుడు వేలూ, మూతి మీద మిగతా వెళ్ళనుంచి.

కోపంతో ముఖమంతా ఓ మాదిరిగా మారిపోయి మనిషంతా వణికిపోతూ, "అనుమానమా! బాగా సెప్పినవ్ తల్లి. మరి ఆ మాంసంల పడ్డ దేంది? దాన్ని నేను పెడితినా?"

"మాంసంలో మందు పెడితే తిన్నంక అరగకుంట అట్లనే ఉంటదా?" సర్పంచ్ ప్రశ్న.

"అరిగిందో, అరగలేదో పడనైతే పడ్డది గదా ? సాచ్చం ఆ కక్కపోసిన ఎరుకలి సాయన్నను అడుగండ్రి." అంటూ ఎరుకలి సాయన్నను చూపించింది.

అందరూ 'ఎరుకలి సాయన్న వైపు చూశారు. అతను సర్పంచ్ వైపు చూస్తూ కొమ్మలు చెలిగిన తుమ్మలా నిల్చున్నాడు. నల్లగా, అర్ధనగ్నంగా. తిండి సరిగ్గా లేక కడుపు వెన్నుకు అంటుకుపోయి కడుపులో పేగులు ఉన్నట్లు కనపడటం లేదు.

"ఏమయ్యా! కక్కపోసినవా?" సర్పంచ్ ప్రశ్న

'ఆఁ' అన్నట్లు తలూపాడు.

"అంజనం గూడ ఏసి మందెవరు పెట్టింది. సూసి

సెప్పిండు.'' అంది దుర్గమ్మ.

"అంజనం గూడ ఏసినవా?'' ఉప సర్పంచ్ ప్రశ్న.

అవునన్నట్టు తలే ఊపాడు. కళ్లు లోపలికి గుంజుకు పోయి రెప్పల్లో సత్తువ లేక వాలిపోయినట్లు ఉన్నాయి.

"అంజనంలో ఏం కనిపించింది?'' సర్పంచ్ అడిగాడు.

"ఆ సూసిన పిల్ల అన్ని అందర్కి సెప్పింది.''

అంటూ ఆ పిల్లను పిలవమని దుర్గమ్మకు సైగచేశాడు. ఆమె అటూ ఇటూ చూసి ఓ ఏడేళ్ళ అమ్మాయిని రెక్క పట్టుకొచ్చి సర్పంచ్ ముందు నిలబెట్టింది.

ఆ అమ్మాయి బిక్కు బిక్కుమంటూ చుట్టూ చూసి, సర్పంచ్ పైపు చూపు నిల్పి నెత్తి గోక్కుంటు నిల్చుంది.

"బిడ్డా అంజనంలో ఏం కనపడ్డది?''

ఏమో అన్నట్టు మూతి కదిలించింది.

"ఏం కనపడలె ? ''

"చ్!'' అంటు తల అడ్డంగ ఊపింది.

"మరి ఏమో సెప్పినవటగద''

"గీన సెప్పమంటె సెప్పిన'' అంటు వేలితో సాయన్నను చూపింది.

"అంతెగాని నీకెం కనపడలె''

"ఉచ్! అంటూ తన తల్లి నిల్చున్న వైపు పోయింది.

"విన్నవా సాయన్నా ! తమరు చేసిన ఈ మూర్ఖపు పనికి ...." సర్పంచ్ పూర్తిగా అనకముందే

"పల్లాడగొట్టాల" గుంపులో నుండి ఓగొంతు అందుకుంది.

"వీని పని తరువాత చూద్దాం. తీసుకపోయి ఆపీసులో కూసొబెట్టు" అని అక్కడే వున్న పంచాయితీ కారోబారుకు చెప్పాడు.

"వీని పని ఇప్పుడే సూడాలి." కొందరు యువకులు సాయన్నను సమీపిస్తూంటే చేయి చేసుకోవద్దని సర్పంచ్ సైగ చేశాడు. అయినా ఆగక ఒకరిద్దరి చేతులు పడనే పడ్డయి.

"గుడ్డిగ నమ్మే వాళ్ళున్నప్పుడు ఎడ్డి సన్నాసి గూడ ఏదో ఒకటి చెపుతనే ఉంటడు." - ఆ ఊరి టీచరు.

"వీడే కాదు. వాని తండ్రి అదే పని సేసేవాడు. పొట్ట పోసుకోడానికి పుట్టెడు మోసాలు." ఓ పెద్ద వయసు వ్యక్తి.

"అది పోని, మందైతే మాకండ్ల ముందే మాంసంల పడ్డది గద!" అత్త. ఆందోళనగ అందరివైపు చూస్తు అంది.

"గదెంత నిజమో, ఇది అంతే నిజం. మందుండదు

మాకుండదు. మంచి మాటే సాలు మరలుకుంటందుకు. ముక్కు మొఖం సక్కగుండి, మనస్సు మనస్సు కల్లా నీళ్లోలె కలసిపోతే సాలు, మందులు కావాల్నా మందు!" అంటు వనం వైపు నడిచింది బాలమ్మ.

ఆమె మాట విన్న అక్కడున్న వాళ్లందరు అదోమాదిరిగా ఆమె వైపు చూస్తూ ఆలోచించసాగారు.

"అనుమానమే కానీ, సమాసమే కానీ అదైతే మాకొద్దు. ఏమయ్యా చెప్పవు?" అంటూ భర్తవైపు చూసింది.

"నేను సెప్తనే ఉంటిగద - అది అసలే వొద్దని."

మల్లమ్మ తల్లిదండ్రుల వైపు చూస్తూ సర్పంచ్ - "మీరేమంటారు?" అని అడిగాడు.

"నా పిల్ల గోవులాంటిది. దాని మీద నింద మోపిండ్రు. దానసోంటి బిడ్డలు ఆల్లకు ఉన్నరు.' అయిన ఈన్ని సేసుకొని నా బిడ్డ ఏమన్న సుఖపడ్డదా! కూలికి కూలి తప్పదాయె, బదనాం తప్పదాయె" అంటూ మల్లమ్మ తల్లి కళ్ల నీరు పెట్టుకుంది.

"భార్యా భర్తలను ఇడదీయటం పాపం. కొన్నేండ్లు కల్సి సంసారం సేసినంక ఇప్పుడది ఎటు పోతది, ఎట్ల బతుకుతది ?" అంది ఓ ముసలమ్మ.

"ఎట్లయ్యేది అట్లయితది. పెండ్లి ఖర్చు, మేమిచ్చిన

నగా, నట్రు అన్నిటినీ మా కిప్పియ్యుండ్రి" అంది మల్లమ్మ తల్లి.

"నీ వేమంటవ్?" మల్లమ్మ తండ్రిని అడిగాడు.

"వొద్దన్నంక సేసే దేముంది, తండ్రి!" అనగానే పంచాయతీ పెద్దల గుండెలు తడైనాయి. పెరిగిన గడ్డంతో పేదరికంలో నలిగిన ముఖపు ముడుతలతో మరేం మాట్లాడకుండా చేతులు జోడించి నిల్చున్న అతని ఆ ఒక్క మాట చావడినంతా కొంతసేపు నిశ్శబ్దంగా మార్చేసింది. అవస్థలు పడుతున్న ఆడపిల్లల తండ్రు లందరు గుంపుగా అతనిలో కనిపించారు.

తనతో కలిసి, తిని, తాగి వియ్యమందుకున్న వెంకయ్యే నేలను చూస్తున్నాడు.

మంచం మీద ఉన్న రాములు కదిలి సర్పంచ్, వైపు, తన భార్య వైపు ఏదో సైగ చేశాడు.

అది చూసిన సర్పంచ్ రాములు దగ్గర కెళ్లి "నీ వేమంటావ్?" అని అడిగాడు.

"ఏ ముంది అనడానికి" అని అన్నాడు చిన్నగా.

"నీ భార్యను ఒదిలిపెడతావా?"

మెల్లగా భార్యను దగ్గరకు రమ్మని సైగ చేసి, ఆమె వైపు మరలి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని, "నేను సావను. తప్పక బతుకుత నన్నొదిలి పోకు" అని

రాములు ఎంతో ఆశతో అన్నప్పుడు మల్లమ్మ గుండె చెరువైంది.

ఆమె మంచం పక్కనే కూలబడి భర్త ఎదమీద తలపెట్టి భోరున ఏడవసాగింది.

రాములు శరీరంలో ఏదో కొత్త సత్తువ చోటు చేసుకోగా, అతను తన భార్య తలను నిమురుతూ తృప్తిగా శ్వాస పీల్చాడు. అతని కనుకొలకులు చెమ్మగిల్లాయి.

ఆ దృశ్యాన్ని చూస్తున్న సర్పంచ్ చెవుల్లో బాలమ్మ అన్న మాటలు.

చూట్టూరా ఉన్న జనం ఒక్కసారే ఏదో బరువును దించేసుకున్నట్టు శ్వాసను వదులుతూ అక్కడి నుంచి కదిలారు.

రాములు తల్లి, తండ్రి బొమ్మల్లా నిల్చుండిపోయారు.

ఓ కుక్క , పిల్లిని తరుముకుంటూ చావడి మధ్య నుండి పరుగెత్తింది.

1991 ●